**కథ**

# నాటి రాయల పేరు...

**ఉదయం ఆరుగంటలకు పది నిముషాల ముందే మెలకువ వచ్చేసింది వసుధకు. కళ్లు తెరచి కొత్తగా కనిపిస్తున్న గదిని పరిశీలనగా చూసింది ఓ నిముషం. మెల్లగా దుప్పటి తీసి పక్కనే పడుకుని చిన్నగా గురకలు పెడుతున్న శారదకు నిద్రా భంగం కలగకుండా లేచి, బట్టలు సర్దుకుని తలుపు తీసుకుని బయట బాల్కనీలోకి వెళ్లి నిలబడింది. కొత్తగా వున్న ఊరిని చూస్తూ అక్టోబరు చలికి కొద్దిగా వణికింది వసుధ.**

వసుధ, శారద హైదరాబాద్ నుండి హంపి చూడాలని కర్నాటక వచ్చారు. వసుధ 'తెలుగు రాజుల స్వర్ణయుగము' అన్న అంశంపైన డాక్టరేట్ కోసం థీసిస్ రాస్తోంది. విజయనగర సామ్రాజ్యము-వారి పాలనాంశాలు అందులో ముఖ్యమైనవి కావడం వల్ల హంపి చూడాలనీ, అక్కడ మ్యూజియం పరిశీలించాలని వసుధ కోరిక. ఒక్కర్తెనే పంపించడానికి వసుధ నాన్నగారు సందేహిస్తూ వుంటే, వసుధ పెదనాన్న కూతురు శారద తనూ సరదాగా వస్తానన్నది. శారద, వసుధ దాదాపు ఒకే ఈడువాళ్లు.

హంపీ నగరం చూడాలంటే పక్కనే వున్న హాస్పేట టౌనులో బస చెయ్యాలి. వసుధ నాన్నగారి ఆర్మీ స్నేహితుడు ఒకాయన రిటైరయి హాస్పేటలోనే వున్నాడు. ఆయనే వీళ్లకు బస ఏర్పాటుచేశారు.

హోటల్ బాల్కనీలో నిలబడి చూస్తున్న వసుధకు అంతకు ముందురోజు సాయంత్రం చూసిన హంపి శిథిలాలు గుర్తు వచ్చి ఎందుకో ఒళ్లు గగుర్పొడిచింది. మళ్లీ అక్కడికి వెళ్లాలని మనసు తహతహలాడింది. చప్పుడు చేయకుండా లోపలికి వెళ్లి, బట్టలు తీసుకుని స్నానానికి బాత్‌రూమ్‌లో దూరింది. గోరువెచ్చని నీటిలో స్నానం చేస్తూ నిన్న జరిగినవి ఆలోచించింది వసుధ.

వసుధ, శారద ఇద్దరూ ముందురోజు మధ్యాహ్నం ఒంటిగంటకు హోటల్లో దిగారు. వసుధ నాన్నగారి స్నేహితుడు శ్రీధరంగానే వాళ్లను భోజనాలకు తీసుకెళ్లారు. వాళ్లు హంపి వెళ్లటానికి టాక్సీ కూడా ఏర్పాటుచేశారు. అంతా అయ్యేసరికి మధ్యాహ్నం మూడుగంటలయింది. శారద అలసిపోయానన్నా వసుధ వినలేదు, హంపి చూడాలని ఉబలాటపడిపోయింది. ఆలస్యమయిపోయింది అన్నా వినలేదు. సరే, చీకటి పడకముందే వెనక్కు వచ్చేయమని శ్రీధరంగారు హెచ్చరించి పంపారు.

హంపీ నగరం ఒకప్పుడు అతి వైభవంగా, రాయల వంశరాజుల సామ్రాజ్యలక్ష్మిగా ఒక వెలుగు వెలిగింది. కానీ ఈరోజు అక్కడ మిగిలినవి ఎక్కువగా శిథిలాలే. హాస్పేట నుండి అరగంట కూడా పట్టదు, కారులో అక్కడికి చేరడానికి.

ముందుగా విఠలస్వామి గుడి దగ్గర ఆగారు వాళ్లు. అందులో స్వరాలు పలికించే యాభై ఆరు స్తంభాలు వున్నాయి. ఆలయ శిల్పకళను చూస్తూ మైమరచిపోయింది వసుధ. ఉన్నట్టుండి వెనుక సన్నని గాజుల గలగల, స్తంభాలను మీటిన రెండు స్వరాల కలయిక వినిపించి ఉలిక్కిపడి శారద కోసం వెనుతిరిగి చూసింది వసుధ. కానీ శారద అక్కడ లేదు, అప్పటికే మెట్లు దిగి గుడి బయట వున్న రాతిరథం దగ్గర నిలబడి రథాన్ని పరిశీలిస్తోంది. వసుధ కుతూహలంతో వేరే స్తంభాలు మీటి చూసింది కానీ అంత మధురస్వరం పలికించలేకపోయింది. వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ శారద దగ్గరకు వెళ్లింది.

గుడి బయట తుంగభద్రానది చూద్దామని ఇద్దరూ నది వద్దకు వెళ్లి నిలబడ్డారు. చల్లటి సాయంత్రం పిల్లతెమ్మెరలు తాకుతూ వుంటే, తుంగభద్ర గలగలలు వారిద్దరినీ ఏవో లోకాలకు తీసుకెళ్లాయి. వసుధ ముక్కుపుటాలకు పరవశింపచేసే సుగంధం తగిలింది. కళ్లు మూసుకునే గాఢంగా పీల్చింది. ఎవరిదో పై రెపరెపలూ, సన్నని చిరుమువ్వల అలజడులూ, అన్నీ వింటూ ఎక్కడున్నదో కూడా మరచిపోయింది. వసుధ మూసిన కళ్ల వెనుక జలకాలాడుతున్న రాణివాసపు చెలులూ, వారి నవ్వులూ, కళ్లు తెరిస్తే కల చెదురుతుందేమో- దూరంగా శారద పిలుపులు విని ఉలిక్కిపడి కళ్లు తెరిచింది వసుధ. సంధ్య చీకట్లు, మూగవోయిన రాతిబండలూ తప్ప మరేమీ కనపడలేదు చుట్టుపక్కల.


స్నానం ముగించి వచ్చి చీర కడుతూ వుంటే మళ్లీ ఆ సుగంధం గుర్తుకొచ్చి ఒళ్లు పులకరించింది వసుధకు. దాని గురించి శారదను కూడా అడిగింది వసుధ. తనకేమీ సుగంధాలూ, దుర్గంధాలూ రాలేదన్నది శారద. పైగా వసుధను ఉడికించింది. ''నీకు పెళ్లీడు వచ్చేసింది, కలల్లోకి వెళ్లిపోతున్నావు!'' అని.

ముందురోజు సాయంత్రం వెనక్కి వెళ్లిపోయే ముందు ఒకే రాతి నుండి మలచిన ఉగ్రనరసింహస్వామిని చూద్దామని ఆగారు. ఏడు తలల సర్పం పడగలో, దాదాపు ఇరవై అడుగుల ఎత్తులో నిజంగానే అతి ఉగ్రమూర్తిలా కనిపిస్తున్న స్వామిని ఇద్దరూ ఆశ్చర్యంగా చూశారు. ఇక కాళ్లు నొప్పులవుతున్నాయి, వెళదాము పద అని లాక్కెళ్లింది వసుధను శారద. కార్లో శారద ఎక్కి కూచున్నాక వెనుకగా ఎక్కుతున్న వసుధకు దూరంగా ఏనుగుల ఘీంకారాలు వినబడినట్టు అయింది. వెనక్కి వెళ్లి నరసింహస్వామి విగ్రహం పక్కనున్న పొట్టిగోడల మీదుగా తొంగిచూసింది. గతించిన కాలానికి మూగసాక్షులుగా నిలచిన బండరాళ్లు తప్ప అక్కడ మరేమీ లేవు. ఎందుకే వెనక్కి వెళ్లావు అని అడుగుతున్న శారదకు జవాబు చెప్పకుండా ఏమీ లేదన్నట్టు తలాడించింది వసుధ.

తల దువ్వుకుని జడ వేసుకుంటూ ఆలోచిస్తోంది వసుధ. ''ఏం జరుగుతోంది ఇక్కడ? నేనే ఊహాలోకంలో కొట్టుకునిపోతున్నానా? చిత్రమైన ఊహలివన్నీ! సరే, ఈరోజు వెళ్లి నాకు కావలసిన విషయాలు రాసుకుని ఓ రెండుగంటల్లో వచ్చేస్తా'' అనుకుంటూ వుండగా, శారద ఇటు వైపు తిరిగి, వసుధను చూసి ఓసారి ఆవలించి ''అప్పుడే బుట్టబొమ్మలా తయారయిపోయావా తల్లీ. ఇప్పుడే నన్ను రమ్మని అడగద్దు ఆ కొండల్లోకి'' అన్నది. వసుధ ఎర్రంచు, ఆకుపచ్చ వెంకటగిరి చీరలో నిజంగానే బుట్టబొమ్మలా వుంది. చాలా అందగత్తె కాకపోయినా తనకు ఒప్పేలా అలంకరించుకోవటం వల్ల చక్కగా కనిపిస్తుంది. ఎక్కువగా నప్పని చుడీదార్లు వెయ్యదు. చీరకట్టులో చెవులకు చిట్టి జుంకీలతో ముచ్చటగా తయారయింది వసుధ.

''ఫరవాలేదు శారదా. ఓ రెండుమూడు గంటల్లో వచ్చేస్తాను. మధ్యాహ్నం మ్యూజియం చూద్దాము. పడుకో'' అన్న వసుధతో శారద ''పదహారణాల తెలుగు పిల్లా, వెళ్తున్నది హంపీ

బృంద తంగిరాల



నగ

రానికి! గుర్రమ్మీద ఓ రాకుమారుడు వచ్చి ఎత్తుకెళ్లిపోతాడేమో జాగ్రత్త'' అంటూ దుప్పటి లాక్కుంది మొహం మీదకు. నవ్వుకుంటూ బయటకు నడిచింది వసుధ.

బయట టాక్సీ డ్రైవరు టీ తాగి సిద్ధంగా వున్నాడు. ఇంకా మంచు విడవని హంపీ నగరం ముత్యాలను దాచుకున్న ఆల్చిప్పలా వుంది. కారును విరూపాక్షస్వామి గుడి వద్ద ఆపేసి ముందుకు నడిచింది. ఆలయ ప్రాంగణమంతా నిశ్శబ్దంగా వుంది. చుట్టూ యాత్రీకుల కోసం నిర్మించిన దశాబ్దాల నాటి మంటపాలూ, తలెత్తి చూస్తే ఎత్తయిన గోపురం. వెనుక ధ్వజస్తంభపు గంటలు వినబడి, తిరిగి చూసింది. గాలికి మెల్లగా ఊగుతున్నాయవి. ఒక్కక్షణం కళ్లు మూసుకోగానే వసుధకు శ్రావ్యంగా వేద పండితుల నమక, చమక స్తోత్రాల ఘోష వినిపించింది. చాతుర్మాస్య వ్రతదీక్షలో వున్న ఆచార్యుల గంభీర స్వరాలూ, రేపు మొదలయ్యే దసరా ఉత్సవాలకు సంభారాలు చేరవేస్తున్న వర్తకుల మంద్ర స్వరాలూ, గతించిన కాలపు కవాటాలెవరో తెరిచారు అనిపించేలా చేశాయి వసుధ మనస్సును.

తల

విదిలించి వడివడిగా బయటకు హంపీ బజారు వైపు నడిచింది వసుధ. ఒకనాడు ఈ బజారు దసరా సమయానికి దేశ విదేశ యాత్రికులతో నిండిపోయేది. దాదాపు ముప్పై అడుగుల వెడల్పు, ఎనిమిది వందల అడుగుల పొడ వున్న ఈ బజారులో ఒకప్పుడు రత్నాలు రాసులు పోసి అమ్మేవారట. బజారుకు అటు చివర మంటపంలో కూర్చున్న పది అడుగుల నంది విగ్రహం చిద్విలాసంగా చూస్తోంది. వసుధకు వెనుక నుండి ఏదో కోలాహలం వినబడి వెనక్కి తిరిగి చూసింది.

వెనుక విరూపాక్షుని గుడీ, బజారు పక్కన మంటపాలూ, మొండిగోడలూ, ఇళ్లూ అన్నీ అక్కడే వున్నాయి. వాటితో పాటు వీధి నిండా ప్రజలూ, వర్తకులూ, ఆడపిల్లలూ, మగపిల్లలూ అంతా హడావుడిగా తిరుగుతున్నారు. బజారుకు అటు, ఇటు వున్న రాతి మండపాలన్నీ నిండిపోయి వున్నాయి. జన జీవితానికి కావలసినవన్నీ

విక్రయి

స్తున్నారు వర్తకులు. రెండు గుర్రాలపై ఇద్దరు సైనికులు స్వారీ చేస్తూ వీధి మధ్యలో వస్తున్నారు. ''అయ్యో జరగవమ్మా'' అంటూ ఎవరో చేష్టలుడిగి చూస్తున్న వసుధను పక్కకు లాగారు. చేతిలో వున్న పుస్తకం పడిపోవటం కూడా గమనించలేదు వసుధ. ప్రూన్పడి చూస్తోంది.

''పదండే, రాణీగారు పుష్పమాలల కోసం

వేచి వుంటారు, త్వరపడండి'' అంటూ పరుగులు పెడుతున్న నలుగురు ఆడపిల్లల వెంట తానూ అడుగులు వేసింది వసుధ. పది, పదిహేను అడుగుల్లో వారు కోదండరామ బజారులో వున్నారు. ఇక్కడా అదే జనప్రవాహమూ, విపణి వీధి వైభవమూ!

''చిన్న రాణీవారు హజార రామ మందిరంలో పూజలో వున్నారు, వెళ్లండి స్వామీ'' అంటూ ఇద్దరు కాషాయధారులకు దారి చూపారు కొందరు భటులు. అటు ఇటు వెళ్తున్న జనసమూహము, అశ్వాలను నడిపించుకుని వెళ్తున్న సైనికులూ- అంతా కలలోలాగా నిలబడిపోయింది వసుధ. ఎవ్వరూ ఆమెను పట్టించుకోలేదు. ఎవరో నిద్రిస్తున్న కాలాన్ని తట్టి లేపినట్టుగా వుంది. గతకాలపు ద్వారాలను తనకోసమే తెరచినట్టున్నది.

అంతలో దూరాన ఒక పెద్ద గుంపు, సాయుధ సైనికుల ఆయుధాల మెరుపులూ, ఏనుగు ఘీంకారాలూ, అన్నీ వినిపించాయి. ''మహారాజుగారు రేపటి దసరా ఉత్సవ సంబరాల సన్నాహాలను పరీక్షించుటకు శ్రీ విఠల మందిరానికి మరో మూడు ఘడియలలో విచ్చేస్తున్నారహో'', అంటూ వెనుక నుండి డప్పు. అది విని అవసరమైనవారంతా కదిలి వెళ్లసాగారు విఠల మందిరానికి. వారి వెంటే వసుధ కదిలింది.

పది అడుగులలో మరో అరుపు. ''మహాత్ములకు త్రోవ వదలండి'' అంటూ. అందరూ బాటకు అటు ఇటు జరిగి నిలబడ్డారు. ఎదురుగా వస్తున్న కాషాయ వస్త్రధారులు కొందరు కనబడ్డారు వసుధకు. వారిలో ఒకరిద్దరు పండు ముదుసలివారు, మిగిలినవారు శిష్యుల వలె వున్నారు. అందరూ వారికి భక్తిగా నమస్కరిస్తూ వుంటే, పెద్ద స్వాములు ఆశీర్వదిస్తున్నారు. కొందరు భక్తులకు చేతిలో ఫలమో, పుష్పమో లేక విభూతి వంటివి ఇస్తున్నారు. అందరూ పక్కకు నిలచి వారికి దారి ఇస్తున్నారు.

వారిలో అందరికన్నా పెద్దవారైన ఒక సాధువు వచ్చి వసుధ ఎదురుగా నిలబడ్డారు. అప్రయత్నంగా చేతులు జోడించింది. ఆయన ఆశీర్వదిస్తూ, ''కంటికి కనబడనివన్నీ అబద్ధము కాదు. కనిపిస్తున్నవన్నీ నిజమే అయి వుండకపోవచ్చు'' అంటూ గాలిలో చేయాడించి, వసుధ చేతిలో ఏదో పడవేసి నడచి వెళ్లిపోయారు.

వసుధ చేయి చూసుకుంటే అందులో రెండు వెన్నముద్దల్లా వున్న విరబూసిన తెల్లని నందివర్ధనాలు, మెరుస్తూ వున్న ఒక బంగారు నాణెమూ వున్నాయి. పుస్తకాల్లో చూసి వున్న వసుధ ఆ నాణెం కృష్ణరాయల కాలంలో చెల్లిన వరహా అని గ్రహించింది. కలలోలాగా ఆ సాధువుల వెంట నడిచింది.

భక్తజన ప్రవాహంతో విఠలస్వామి మందిరంలోకి అడుగుపెట్టింది. ఎక్కడ చూసినా పుష్పాలంకరణ, కస్తూరి వాసనలూ, ధూప సుగంధ పరిమళాలూ- ఆ ప్రవాహంలో కొట్టుకునిపోతున్న భావన వసుధకు. దాహం వేస్తోంది. ''అదిగో మహారాజు'' అన్న కేకలూ- సైనికుల ఆయుధాల తళతళలూ- ఓపిక సన్నగిల్లి మందిరంలో ఒక మూలలో కూలబడిపోయింది వసుధ.

మొహం మీద చల్లగాలి, మృదువుగా ఎవరిదో చేతిస్పర్శ తగిలి కళ్లు తెరచి చూసింది వసుధ. కంగారుగా తన మొహంలోకి చూస్తున్న శారద, పక్కనే తెల్లకోటులో ఒక డాక్టరు, శ్రీధరంగారూ కనబడ్డారు. తాను ఏదో హాస్పిటల్లో వున్నట్టు అనిపించింది వసుధకు. ''ఎలా వుంది వసూ'' అని అడుగుతున్న శారదను చూసి ఫర్వాలేదన్నట్టు తలాడించింది వసుధ. ''పొద్దున్నే ఏడు గంటలకు వెళ్లావు ఆ హంపికి. మధ్యాహ్నం పన్నెండు గంటలయిపోయినా నువ్వు రాకపోతే, నేనూ శ్రీధరంగారు ఇంకో కారులో వచ్చాము. నువ్వు వెళ్లిన టాక్సీ డ్రైవరు నిద్రపోతున్నాడు. కంగారుపడి మేము వెతికితే హంపీ బజారులో నీ నోట్‌బుక్కు దొరికింది. ఓ వంద అడుగుల దూరంలో నీ చెప్పులు దొరికాయి. హడలి చచ్చానే అనుకో. చివరకు విఠలస్వామి మందిరంలో సొమ్మసిల్లి పడి వున్నావు. అందరము కలసి నిన్ను ఈ క్లినిక్‌కు తెచ్చాము. అసలేం జరిగింది వసూ'' అంటూ గుక్కతిప్పుకోకుండా మాట్లాడుతున్న శారదను ఊరుకోమని డాక్టరు ఆపారు.

రెండుమూడు గంటలు విశ్రాంతి తీసుకున్నాక, డాక్టరు వచ్చి ఏం జరిగిందని అడిగి తెలుసుకున్నారు. అన్నీ విని శారద, శ్రీధరంగారు ఏమీ మాట్లాడలేదు. డాక్టరుగారు మాత్రం ''ఎండకు, ఎక్కువ దాహానికి ఒక్కోసారి హాలూసినేషన్ అని జరుగుతుంది. ఈ విధంగా లేని విషయాలు కల్పించటమూ వంటివి మనసు చేస్తుంది. ఎడారుల్లో ఏమీ లేకపోయినా ఇసుక మీద కనిపించే ఎండమావులు (ఒయాసిస్) వంటిదే ఇది కూడా. మరేం ఫరవాలేదు. రేపు మీరు ప్రయాణం చెయ్యొచ్చు'' అని ధైర్యం చెప్పారు.

శారద చాలా సంతోషపడిపోయింది. ''మొన్నంత కలవరించావు కదే! ఇక మన లోకంలోకి రావే తల్లీ'' అని బతిమాలింది. ''ఏమ్మా, సినిమాల్లోలా ఎన్టీరామారావుగారు శ్రీకృష్ణదేవ రాయల వేషంలో కనిపించారా?'' అని జోకులేశారు.

అన్నీ విని ఏమనాలో తోచలేదు వసుధకు. నీరసంగా కళ్లు మూసుకుని పడుకుంది. మరుసటిరోజు మధ్యాహ్నం పన్నెండుకే బస్సు వుంది, బయలుదేరవచ్చు అని చెప్పారు శ్రీధరంగారు. మరొక్కసారి హంపి చూస్తానని వసుధ బతిమాలింది శారదను. సరే, పది నిముషాలే, వెంటే నేనూ వస్తానని షరతు పెట్టింది శారద. గుడి లోపలికి వెళ్లకుండా, తుంగభద్రా ఒడ్డుకు నడిచింది వసుధ. నీడలా నడిచింది శారద వెంటే.

నది ఒడ్డున కూర్చుని కాళ్లు నీళ్లల్లో ముంచి ఒక్కక్షణం కళ్లు మూసుకుంది వసుధ. అమ్మ చేతి గాజుల్లా సన్నగా గలగలమని పారుతోంది తుంగభద్ర. ఎన్నో ఏళ్లుగా, దశాబ్దాలుగా అలుపు లేక, ఎన్నో జ్ఞాపకాలను తనలో దాచుకున్న తుంగభద్ర. వసుధకు మనసులో మధుర గాయకుడు ఘంటసాల స్వరం వినబడుతోంది. ''నాటి రాయల పేరు నేటికిని తలపోయు- తుంగభద్రా నదీ తోయ మాలికలందు- ఆడవే...'' అంటూ. వసుధ కనుకొలకుల నుండి రెండు కన్నీటి చుక్కలు జారిపడ్డాయి.

శ్రీధరంగారు వారిద్దరినీ బస్సు ఎక్కించారు. బాధగా ఊరు వదిలింది వసుధ. ఏదో పోగొట్టుకున్న భావన మనస్సులో.

మధ్యలో ఏదో ఊళ్లో బస్సు ఆగితే వారపత్రిక కోసం దిగింది శారద. మంచినీళ్ల బాటిళ్లు అమ్ముతున్న కుర్రాణ్ణి పిలవాలని చిల్లర కోసం తన హ్యాండ్ బ్యాగ్‌లో చెయ్యిపెట్టి, చేతికి అందినవన్నీ బయటకు తీసింది వసుధ. పిడికిలి తెరచి చూసి నిశ్చేష్టురాలైపోయింది- అరచేతిలో పాత టిక్కెట్లు, కొంత చిల్లరతో పాటు రెండు వాడిపోయిన నందివర్ధనాలూ, మెరుస్తున్న ఓ వింత నాణెం...!

